క్లుప్తంగా

అరుణాచలేశ్వరస్వామికి రుద్రాభిషేకం



విశేష అలంకరణలో అరుణాచలేశ్వరస్వామి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో వేంచేసిన అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామికి సోమవారం సామూహిక మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. తెల్లవారుజామున పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాకుడు స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాఠశాల ఆర్చి ధ్వంసం



దెబ్బతిన్న ఆర్చిని పొక్లెయిన్‌తో తొలగిస్తున్న దృశ్యం

కిర్లంపూడి: టిప్పర్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాల ఆర్చి ధ్వంసమైంది. సోమవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో పాఠశాల ఆవరణలో క్రీడా మైదానానికి టిప్పర్‌పై గ్రావెల్ వచ్చింది. కాగా లారీ డ్రైవర్ ఆర్చి ఎత్తు చూసుకోకుండా రావడంతో టిప్పర్ పైభాగం తగిలి ఆర్చి ధ్వంసమైంది. ఓ పక్కకు వాలిపోయి ప్రమాదకరంగా మారడంతో వైఎంసీ చైర్మన్ ఆళ్ల బాబులుకు స్థానికులు సమాచారం ఇచ్చారు. ఆయన పొక్లెయిన్‌తో ఆర్చిని పూర్తిగా తొలిగించారు. పాఠశాలకు చెందిన 1975–76 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఈ ఆర్చిని ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు శిథిలంగా మారిన ఆర్చిని చూసి విచారం వ్యక్తం చేశారు. యథావిధిగా ఆర్చిని నిర్మించాలని కాలేజ్ ప్రిన్సిపాల్, పాఠశాల హెచ్‌ఎంను పూర్వ విద్యార్థులు శరకణం భద్రం, తోట గోపి కోరారు.

రాత బాగుంటే.. మార్కుల మోత

- ముత్యాల్లాంటి అక్షరాలతో మరిన్ని మార్కులు
- టెన్త్ విద్యార్థులు దస్తూరీపై దృష్టి పెట్టాలని ఉపాధ్యాయుల సూచన
- నియోజకవర్గంలో 3,058 మంది విద్యార్థులు



గెద్దనాపల్లి ప్రభుత్వోన్నత పాఠశాలలో పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

కిర్లంపూడి: పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. విద్యార్థుల ధ్యాసంతా చదువుపైనే ఉంటోంది. చేతిరాతపై దృష్టి పెడుతున్న వారు కొద్ది మందే ఉంటున్నారు. చదువుతో పాటు చేతి రాతపై కూడా దృష్టి పెడితే మంచి మార్కులు సాధించవచ్చునని విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. పరీక్షల్లో సమాధానాలు ఉన్నది ఉన్నట్టు రాసినా.. దస్తూరీ ఎంత బాగా ఉందన్నదే ముఖ్యం. ఏం రాశామన్నది పేపరు మూల్యాంకనం చేసే వ్యక్తికి అర్థమైతే ఎక్కువ మార్కులు వేసేందుకు అవకాశం ఉంటుంది. ఏడాది పాటు చదివిన అంశాలను రెండున్నర గంటల్లో ఆన్సర్ షీట్‌పై పెట్టాలి. దీంతో పరీక్షల సమయంలో సహజంగానే విద్యార్థుల్లో ఆందోళన ఉంటుంది. ఈ ఒత్తిడిని జయిస్తే మంచి మార్కులు సాధించవచ్చు.

నియోజకవర్గంలో ఇలా...

జగ్గంపేట నియోజకవర్గంలో 32 ప్రభుత్వోన్నత పాఠశాలల్లో 3,058 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి రాయనున్నారు. వీరంతా బాగా చదివి పరీక్షలకు సంసిద్ధమవుతున్నారు. ఇప్పటికే అక్షరాలు గుండ్రంగా రాసే విధంగా ఉపాధ్యాయులు తర్ఫీదు ఇస్తున్నారు.

సాధన చేస్తే...

విద్యార్థులు పరీక్షల్లో మొదటి ప్రశ్నకు సమాధానం చక్కగా రాసి, తర్వాత వేగం పెరిగేకొద్దీ అందంగా రాయలేకపోతుంటారు. దీనిని అధిగమించాలంటే ముందుగానే దస్తూరిపై సాధన చేస్తే పరీక్షల్లో ఇబ్బందులు ఉండవని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఆణిముత్యాల్లాంటి అక్షరాల కోసం కొన్ని ప్రాథమిక సూత్రాలు పాటించాలని కిర్లంపూడి ఎంఈఓ మక్కా చిన్నారావు చెప్పారు.

ఈ జాగ్రత్తలతో మంచి ఫలితాలు

- సమాధాన పత్రంలో రాసే జవాబు సూటిగా ఉండటంతో పాటు అక్షరాలు పొందికగా ఉంటే పేపరు దిద్దేవారు ఒకటికి రెండు మార్కులు అదనంగా వేసే అవకాశం ఉంటుంది.
- పేజీ పైభాగంలోను, ఎడమ వైపు ఒక అంగుళం మార్జిన్ విడిచి పెట్టాలి.
- సామాన్య, భౌతిక శాస్త్రాల్లో బొమ్మలు గీసి, భాగాలు గుర్తించే విషయంలో పెన్ను ఒత్తి పెట్టి రాయకూడదు. ఇలా చేస్తే పేపర్ వెనుక అసహ్యంగా కనిపిస్తుంది.

నియోజకవర్గంలో పాఠశాలలు, పదో తరగతి విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
కిర్లంపూడి	8	750
గోకవరం	8	820
జగ్గంపేట	10	1056
గండేపల్లి	6	432
మొత్తం	32	3,058

- పేజీలో వాక్యాలు పైనుంచి కిందకు లేదా పైకి ఉండకుండా వరుస క్రమంలో ఉండాలి.
- పేజీకి 16 నుంచి 20 లైన్లు మించి రాయకూడదు.
- రోజూ కొద్దిసేపు సాధన చేస్తే పరీక్షల్లో ఆందోళన లేకుండా సాఫీగా రాయవచ్చు.
- పెన్ను సక్రమంగా పట్టుకొని రాస్తే.. రాసే అక్షరాలు అందంగా.. గుండ్రంగా ఉంటాయి.
- జవాబులు రాసేటప్పుడు ప్యాడ్ పైకి వాలిపోకుండా సాధ్యమైనంత వరకూ నిటారుగా కూర్చుని రాయడం మంచిది.
- అక్షరాలు, పదాలు, వాక్యాల మధ్య తగినంత ఖాళీ ఉండాలి.

చేతిరాతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందే..



శాస్త్ర, సాంకేతిక రంగం ఎంత ఎదిగినా చేతిరాతకు ప్రాధాన్యం పెరుగుతూనే ఉంది. సంబంధిత భాషపై పట్టు ఉంటే రాయడం తేలిక అవుతుంది. దస్తూరీ బాగున్న విద్యార్థులు అదనంగా మార్కులు పొందే అవకాశం ఉంటుంది. మా పాఠశాలలోని విద్యార్థులకు ఈ తరహా తర్ఫీదు ఇస్తున్నాం.

–సూరిశెట్టి వీరబాబు, ఉపాధ్యాయుడు, గెద్దనాపల్లి హైస్కూల్

అదనపు మార్కులు సొంతం



అదనపు మార్కులకు చేతిరాత చాలా ముఖ్యం. చేతి రాతను బట్టి విద్యార్థి సామర్థ్యాన్ని అంచనా వేయవచ్చు. పాఠశాల సముదాయ సమావేశాల్లో ఇదే విషయాన్ని అధికారులు స్పష్టం చేస్తున్నారు. విద్యార్థి రాసే సమాధానం ద్వారా అతని వ్యక్తిత్వాన్ని అంచనా వేయవచ్చు. దస్తూరీ బాగుంటే మంచి మార్కులు వస్తాయి. మానసిక ఒత్తిడితో రాయకూడదు. చేతి రాత బాగుంటే మంచి ఫలితాలు సాధించవచ్చు.

–టి.జోసెఫ్, ఎంఈఓ కిర్లంపూడి

రేపు విద్యుత్ అంతరాయం

శంఖవరం: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా బుధవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ జగ్గంపేట ఈఈ బి.వీరభద్రరావు సోమవారం తెలిపారు. మండలంలోని కొంతంగి, నెల్లిపూడి గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అందుబాటులో ఖరీదైన ఇంజక్షన్



రోగులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి శైలజ

ఏలేశ్వరం: ఖరీదైన గుండెపోటు నివారణ ఇంజక్షన్ ప్రజలకు అందుబాటులో ఉందని స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారి డి.శైలజ తెలిపారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం స్టెమి గుండెకు భరోసా కార్యక్రమంపై రోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుండెపోటు వచ్చిన రోగులకు వెంటనే ఇచ్చే నివారణ ఇంజక్షన్ (టెనెక్టెప్లేస్) అందుబాటులో ఉందన్నారు. ఇప్పటివరకు ఏడుగురికి ఇంజక్షన్ ఇచ్చినట్టు తెలిపారు. రోగులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

భూ ఆధార్ నమోదు తప్పనిసరి



ఎస్‌ఎస్‌వీ నగరంలో భూ ఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏఓ అశోక్ కుమార్

తుని రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే పథకాలు పొందేందుకు రైతులు తప్పనిసరిగా తమ భూములకు ఆధార్ తరహా విశిష్ట గుర్తింపు సంఖ్య (భూ ఆధార్) నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.అశోక్ కుమార్ సూచించారు. మండలంలోని ఎస్‌ఎస్‌వీ నగరం, ఎస్.సూరవరం గ్రామాల్లో జరుగుతున్న భూ ఆధార్ నమోదు ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ సొంత భూమి కలిగిన రైతులకు కేంద్ర ప్రభుత్వం ఆధార్ కార్డు తరహాలో 14 అంకెల యూనిక్ ఐడీ కార్డులు అందించనున్నట్టు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాలు, రాయితీలు, సంక్షేమ పథకాలు పొందాలంటే రైతులు 14 అంకెల విశిష్ట సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) తప్పనిసరి అన్నారు. ఈ కార్డులు పొందేందుకు సొంతభూమి కలిగిన రైతులు అర్హులన్నారు. ఎంపీ కిసాన్, రాయితీలు, పెట్టుబడి, ఎరువుల రాయితీలు, పంట బీమా, పంట నమోదు, గిట్టుబాటు ధర, పంట రుణాలు, వివిధ రకాల వ్యవసాయ, అనుబంధ రంగాల సేవలకు విశిష్ట సంఖ్య ఉపయోగపడుతుందన్నారు. భూమి పట్టాదార్ పాసుపుస్తకం నకలు, 1బి, ఆధార్ జెరాక్స్, బ్యాంకు ఖాతాకు లింకైన ఫోన్ నంబరుతో రైతు సేవా కేంద్రంలో విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

తారస్థాయికి కూటమి నేతల అరాచకాలు

- మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబంపై ప్రభుత్వం కక్షసాధింపు
- మండిపడిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం



జగ్గంపేటలో విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట నరసింహం

జగ్గంపేట: రాష్ట్రంలో కూటమి నేతల అరాచకాలు తారస్థాయికి చేరాయని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. జగ్గంపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు మిథున్‌రెడ్డిపై కూటమి నేతలు తప్పుడు అవినీతి ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీ భూములు ఆక్రమించినట్లు ఆరోపణలు చేస్తున్న కూటమి నేతలు వాటిని ఎందుకు రుజువు చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అటవీ భూముల ఆక్రమణలపై దర్యాప్తు చేయించి రిపోర్టు తెప్పించుకున్నారని తెలిపారు. అందులో పెద్దిరెడ్డి కుటుంబంపై వస్తున్న ఆరోపణలకు ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో పవన్‌కల్యాణ్ మౌనం వహించారన్నారు. కూటమి నేతల దౌర్జన్యాలు రాష్ట్రస్థాయి నుంచి గ్రామం వరకూ ప్రతిస్థాయిలోనూ కొనసాగుతున్నాయని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే కూటమి నేతలు సహజ వనరులను దోచుకుంటున్నారని మండి పడ్డారు.

జగ్గంపేట నియోజకవర్గంలోనూ కూటమి నేతల దోపిడి తారాస్థాయికి చేరిందన్నారు. జగ్గంపేటలో తాను ప్రతి సోమవారం ప్రజలు, పార్టీ వర్గాలకు అందుబాటులో ఉంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రావుల గణేష్‌రాజా, పట్టణ అధ్యక్షుడు కాపారపు ప్రసాద్, గండేపల్లి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, రామకుర్తి మూర్తి, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై ఫిర్యాదు



తాళ్లూరు చెరువులో నరికివేసిన చెట్లు, కలప

గండేపల్లి: తాళ్లూరు పంచాయతీ పరిధిలోని చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికి తరలించుకుపోయినట్టు ఆ పంచాయతీ కార్యదర్శి షకీలా గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. తాళ్లూరులోని పంచాయతీ చెరువులో 2015లో అప్పటి పాలకవర్గం ఎన్‌ఆర్జీఎస్ నిధులతో మొక్కలు పెంపకం ప్రారంభించింది. నాటి నుంచి మొక్కలు పెరిగి వృక్షాలుగా మారాయి. వీటిని ఆదివారం గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి నరికించి ట్రాక్టర్ ద్వారా తరలించినట్టుగా గ్రామస్తులు చెబుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా చెట్లను నరికి తరలించుకుపోవడం వాస్తవమేనని, దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కాగా ప్రజా ప్రయోజనార్థం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సచివాలయం నిర్మిస్తుండగా చెట్లు తొలగించకూడదని కోర్టులో పిల్ దాఖలు చేసిన వ్యక్తి ఇప్పుడు ఏవిధంగా చెట్లు నరికించి తరలించారని వైఎస్సార్ సీపీ నేత, జిల్లా వ్యవసాయశాఖ సలహామండలి సభ్యులు ఒబిణ్ని వీరబాబు ప్రశ్నించారు. చెట్లను నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ముగిసిన అమ్మవారి జాతర

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేట గ్రామ దేవత వీరమ్మ పేరంటాలు అమ్మవారి జాతర మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ నెల 4న ప్రారంభమైన జాతర ఆరు రోజుల పాటు వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆలయ కమిటీ పేర్కొంది. చివరి రోజు అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పొగమంచుతో వాహనదారులకు ఇక్కట్లు



కోటనందూరులో కమ్మేసిన మంచు

కోటనందూరు: పల్లెల్లో మంచు వర్షంలా కురుస్తోంది. సీతాకాలం ముగుస్తున్నప్పటికీ ఇంకా పల్లెలను ఒకపక్క చలి వణికిస్తుంటుండగా మరో పక్క మంచుదుప్పటి కమ్మేస్తుంది. సోమవారం ఉదయం భారీగా మంచు కురవడంతో తెల్లవారే పనులకు వెళ్లే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 8.30 గంటల వరకూ మంచు కురవడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం అవస్థలు పడుతున్నారు. వాహనదారులు లైట్ల వెలుగులోనే నిదానంగా వెళ్లాల్సి వస్తోంది. కాగా పూతమీద ఉన్న మామిడి, జీడి మామిడి తోటలకు ఈ మంచుతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాహనాల తనిఖీ



నిబంధనలు పాటించని వాహన డ్రైవర్‌కు సూచనలిస్తున్న కత్తిపూడి ఎంవీఐ శ్రీనివాస్

శంఖవరం: నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను తరలిస్తున్న వాహనాలకు కత్తిపూడి మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ శ్రీనివాస్ రూ.98 వేల జరిమానా విధించారు. సోమవారం కత్తిపూడిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. కత్తిపూడి మీదుగా అన్నవరం, శంఖవరం తదితర గ్రామాలకు ప్రయాణికులతో వెళ్తున్న పది వాహనాలు నిబంధనలు పాటించకపోవడంతో జరిమానా విధించారు.

మండల అధికారుల నంబర్లు

కిర్లంపూడి:

తహసీల్దార్	– 98499 03886
ఎంపీడీఓ	– 91009 70617
ఎంఈఓ	– 90009 12335
ఎంఈఓ–2	– 98487 43433
ఏపీఓ	– 83744 46309
ఏపీఎం	– 96523 04151
ఎస్సై	– 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	– 77024 41029
వీరవరం వైద్యాధికారి	– 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	– 81066 28018
మండల వ్యవసాయాధికారి	– 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	– 89580 44698
భూపాలపట్నం పశువైద్యాధికారి	– 95429 08025
వీరవరం పశువైద్యాధికారి	– 89789 41840
హౌసింగ్ ఏఈ	– 70939 30461
ఇంజనీరింగ్ అధికారి	– 97014 77778

మండల అధికారులు

కోటనందూరు:

తహసీల్దార్	టి.సుభాష్	8008803205
ఎంపీడీఓ	వెంకటనారాయణ	98496 63415
మండల వైద్యాధికారి	యామిని కావ్య	76750 32399
వ్యవసాయాధికారి	కేజే చంద్రశేఖర్	83310 56617
ఎంఈఓ–1	ఏవీఎస్ శ్రీనివాస్	89856 02864
ఎంఈఓ–2	రామశేఖర్	96529 81857
కోటనందూరు పశువైద్యాధికారి	ఎం.రత్నతేజ	86398 13895
పాతకొట్టాం పశువైద్యాధికారి	ప్రదీప్‌కుమార్	94919 34613
ఎస్సై	టి.రామకృష్ణ	94409 00773
వెలుగు ఏపీఎం	పి.సూర్యకుమారి	80088 04895
ఉపాధిహామీ ఏపీఓ	రాజగోపాల్	70939 98217
ఏఎస్ఓ	ఎస్.వామనమూర్తి	989796696

పంచాయతీ కార్యదర్శుల నంబర్లు

తుని రూరల్:

డి.పోలవరం	ఎ.వెంకటరమణ	99597 75978
రాపాక, దొండవాక	ఎ.రాజబాబు	94915 77507
వెలమ కొత్తూరు	జి.నాగన్నదొర	81971 08026
రేఖవానిపాలెం, చామవరం	టివివి.సత్యనారాయణ	9642148603
ఎస్.అన్నవరం	ఎం.వీరలక్ష్మి	94939 56019
వల్లూరు	పి.గంగాధర్	73828 71648
టి.తిమ్మాపురం, తేటగుంట	కె.వెంకటలక్ష్మి	93475 98696
కె.ఓ.మల్లవరం	జె.వీరబాబు	79893 63121
కుమ్మరిలోవ, హంసవరం	ఎస్.స్వామి	95029 33732
కొలిమేరు, ఎస్.సూరవరం	ఎస్.శ్రీను	80999 95557
తాళ్లూరు, చేపూరు	ఎస్‌వీవీ రమణ	97053 70220
రాజుపేట	ఎం.పవన్ కుమార్	85559 12177
ఎస్.ఎస్.వి.నగరం	నల్లల భూములు	94939 53900
హెచ్.కొత్తూరు	ఎస్.వరయ్య	96038 69898
ఎ.అగ్రహారం	కె.బాబురావు	94920 94095
అటికెవానిపాలెం	ఎస్‌కే ఇస్మాయిల్	81791 40637
లోవకొత్తూరు	కె.వెంకటరాజేష్	88854 22289

నులిమేద్దాం

- ఘనంగా జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం
- గ్రామాల్లో జోరుగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన



వి.కొత్తూరు కేజీబీవీలో పీఓ ప్రభాకర్ సమక్షంలో విద్యార్థినులకు మాత్రలు వేస్తున్న వైద్యులు

తుని రూరల్: నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని రాష్ట్రీయ బాలశిక్ష ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ ఐ.ప్రభాకర్ అన్నారు. మండలంలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలు, వి.కొత్తూరులోని ఎస్సీ, ఎస్టీ, కేజీబీవీ విద్యాలయాల్లో సోమవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, కేజీబీవీ విద్యాలయాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని విద్యార్థినులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్స్ పి.నిర్మల కుమారి, అమృతవాణి, విజయకుమారి, తేటగుంట పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ పి.సాహితి, డాక్టర్ జి.నీరజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనకు కృషి చేద్దాం

గండేపల్లి: నులిపురుగులను నిర్మూలించేందుకు కృషి చేద్దామని ఎంపీడీఓ నాతి బుజ్జి, ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ, పీహెచ్‌సీ వైద్యుడు కేవీ నరేష్ పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని తాళ్లూరు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఎంపీడీఓ నాతి బుజ్జి, సీడీపీఓ పూర్ణిమ పిల్లలతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టనున్న పోషక వాటికను పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త వై. వెంకటలక్ష్మి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో పిల్లల్లో ఆరోగ్యం

తొండంగి: పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయడం ద్వారా రక్తహీనత సమస్య తగ్గి ఆరోగ్యవంతంగా ఉంటారని ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ అన్నారు. ఏవీ నగరం పీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో 2633 మంది పిల్లలకు గాను 2594 మందికి (98.5 శాతం) మాత్రలు పంపిణీ చేశామన్నారు. ఈ నెల 19 వరకూ ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏడాదిలో రెండుసార్లు కచ్చితంగా డీవార్మింగ్ మాత్రలు వేయించాలన్నారు. రావికంపాడు, పెరుమాళ్లపురం, తొండంగి పీహెచ్‌సీల పరిధిలోనూ విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యురాలు పి.భారతి, హెల్త్‌సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

గోకవరం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. గోకవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో డీవార్మింగ్ మాత్రల పంపిణీని ఎంఈఓ బి.గౌరమ్మ ప్రారంభించారు. కొత్తపల్లి వైద్యాధికారి డాక్టర్ నిఖిత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది విద్యార్థులతో మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డీ వార్మింగ్ డే ఆవశ్యకత, అనీమియా, చేతుల పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మండలంలో 94 శాతం మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశామని, మిగిలిన వారికి ఈ నెల 17న పంపిణీ చేస్తామని ఎంపీహెచ్ ఈఓ డీఎస్ మూర్తి తెలిపారు.



ఎ.కొత్తపల్లి హైస్కూల్లో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న డాక్టర్ రవికుమార్



గోకవరం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డాక్టర్ నిఖిత